కథానిక

# అర్థంకాని విలువలు

వి. ఎస్. కళ్యాణి

'కాస్త వాడెక్కడికెళ్ళాడో ఏవిటో ఎవర్నైనా కనుక్కుందూ' అంది హృదయంలో ఆరాటాన్ని మాటల్లో పొందుపరుస్తూ సుందరమ్మ. మూర్తి అన్నం తింటున్నాడు. మజ్జిగపోస్తూ ఆ మాటలంది తల్లి.

అబ్బ... ఇంత పులుపు రోడ్డుగావుందేం వెధవమజ్జిగ!" అంటూ అడిగినదానికి ప్రత్యుత్తరంగాని అంగీకారంగాని ఏవిధంగానూ సూచించకుండా తమ్ముడిమీద కోపాన్ని మజ్జిగ మీదనే ప్రసరింపజేస్తూ అది పుల్లగా వుండటానికి తల్లే కారణంగా చూశాడు మూర్తి.

"పుల్లగా వుండటానికికూడా నేనే కారణం అంటావేవిట్రా?" వేసవికాలం అంతమాత్రానికే! మధ్యలోనే అందుకున్నాడు మూర్తి. "అంతమాత్రానికి! తినలేక చస్తుంటే... తోడుపెట్టడానికి పావుశేరు మజ్జిగ పోస్తావులా వుంది!" అంటూనే అన్నం సగం పక్కకి పెట్టి ఎల్లాగో కంచము ముందు నుంచి లేచాడు. తల్లి మనస్సు నొచ్చుకున్నదన్నమాట వాస్తవమే అయినా సుందరమ్మకీ పద్ధతి పొరపాటే. కొడుకులచేత కాకపోతే ఎవరిచేత పడాలి తనుమాత్రం! కాని పెద్దకొడుకు అనవసరంగా తనను విసుక్కున్న దానికన్నా ఆమె మనస్సును మరింత కలవరపెడుతున్నది. వాసు రాత్రి ఎనిమిది గంటలైనా ఇంటికి రాకపోవడం కాలేజీకి వెళ్లిన వాడికి ఎనిమిది గంటలదాకా ఏంపనుంటుంది? ఎక్కడున్నాడో ఎందుచేత రాలేదో? ఏంజరిగిందో? మూర్తి ఎక్కడికైనా పంపి కనుక్కోమనాలనుకుంది. అదే తను చెప్పినపుడు పుల్లమజ్జిగ నెపంమీద విసుక్కున్నాడు కాలం పరుగులు పెడుతూంటే కడుపులో ఆరాటంకూడా అధికంగా వొచ్చింది. తొమ్మిదికూడా అవుతోంది. ఆమె కళ్లల్లో భూగోళం గిర్రున తిరుగుతూంటే ప్రపంచాలు కదిలి పోతూంటే సముద్రాలు నేత్రాంచల సీమల్లో ప్రరోపిస్తూవుంటే పక్షిలా ఎగిరి కన్నకొడుకు జాడలు కనిపించిన చోటుల్లా వెతికి కనుక్కోవాలని మాతృహృదయం ఉద్వేగం చెందింది! కాని మానవమాతృరాలైన తానేం చేయగలుగుతుంది? తల్లి గుండెల్లోని బాధని పోల్చుకోలేని పెద్దకొడుకు విసుక్కోటానికి మాత్రమే కారణం కాగలిగింది!

సుందరమ్మ ఆవేదనాభరిత హృదయం నిట్టూర్చింది. తననిస్సహాయత్వానికి తనని తాను తిట్టుకుంది. ఎలాగైనాసరే మూర్తితో చెప్పి కాస్త ఎవర్నైనా కనుక్కోమనాలి. ఎక్కడైనా గాలించమనాలి. సుందరమ్మ గుమ్మాని కానుకుని నిలబడింది. మూర్తి ఏదో చదువుతున్నాడు. తలెత్తి చూశాడు. తల్లి వదనంవైపు దృష్టి సారించాడు. ఆమె ముఖంలో ఆవేదనా చ్ఛాయలు ప్రస్ఫుటంగా తాను చూశాడు. ఆమె చెప్పబోయేదికూడా తాను ఊహించుకున్నాడు. "భోజనం చేయవే?" — సహజమైన నిర్లక్ష్యస్వభావం కంఠస్వరంలో ప్రతిధ్వనిస్తూనేవుంది. "చేస్తాను కాని ఇంతకీ వాసెక్కడి కెళ్లివుంటాడురా? తొమ్మిదిన్నరకూడా కావస్తోంది... కాస్త ఎవర్నైనా కనుక్కుంటే? కాలేజీనుంచే రాలేదు!–" అణచుకుందామనుకున్నా ఆవేదన ఆగలేదు. మూర్తి కనుబొమలు ముడిచాడు.

"వెధవ! మరీ రౌడీ అయిపోతున్నాడు. ఈ మహారాజు నానాచోట్లా సంచారాలు సాగిస్తూంటే వెనకాల చప్రాసీలా నేను చావాలి కాబోలు! బండవెధవలా తిరుగుతూవుంటే పెట్టి పోషించాల్సిన అవసరం నాకేంపట్టింది? అంతకంతకు ఏమనాలోకూడా తెలియకుండా వుంది!" తల్లికి మూర్తి ఈ మాటలు అంటాడని ముందే తెలుసు. మౌనంగా వరండాలోనిఅంధకారంలో కనపడే చిత్రాలను వీక్షిస్తోంది. మూర్తికి కళ్లు పేపరు మీద ఉన్నాయి. నోరు తమ్ముణ్ణి తిట్టకుండా వుండలేనంది. లోపల కోపం పరవళ్లు తొక్క-

తోంది. అతనికి ఇంతరాత్రిపూటా బయటికివెళ్లితే ఏవిధంగా వాసు ఉనికి తెలుస్తుందో అర్థంకాలేదు. "ఈయనకి దగుల్బాజీ స్నేహితులకి కొదవలేనుగా ఎక్కడో వుండేవుంటాడు. ఏవయినా కానీ నేనుమాత్రం ఈ అర్థరాత్రిలో అంగచాట్లు పడలేను!" మూర్తి అక్షరాలా నమ్మింది అదే కాబట్టి అతను మరోలా ఆలోచించలేదు. పేపరు టేబిల్ మీదికి విసిరికొట్టి అలసిపోయిన వాడిలా పడక కుర్చీకి జార్లపడి కళ్లు మూశాడు. మౌనంగా వింటున్న సుందరమ్మ మూర్తివంక ఓసారి చూసి బరువుగా నిట్టూర్చింది. వాయు తరంగాలలో వేగంగా దూసుకుపోయిన ఆ వ్యథాపూరిత నిస్వనంలో శతసహస్ర ఆవేదనల ప్రతిధ్వనులు పలుముఖాలుగా నినదించాయి. వీధితలుపు ఓమారు తెరిచి నిశీధీ హృదయంలో ఏమైనా అలికిడి వినవస్తుందేమో వీక్షించింది... ఎక్కడో వెలుగుతూన్న విద్యుద్దీప కాంతిలో వీథంతా మసకగా బావురుమంటూంది. తిరిగి బాధగా మూలిగింది. మాతృహృదయం. తలుపు గడియవేసి లోపలకు వచ్చింది. మూర్తి కళ్ళు మూసుకునేవున్నాడు కుర్చీలో. వాతావరణంలోని భీభత్సం ఆమె ముందు చిత్రరూపాలను దాల్చింది. సుందరమ్మ కళ్ళల్లో నీరు కమ్ముతోంది. వంటింటి తలుపులు తాళంవేసివచ్చి వరండాలో గుమ్మంమీద చేయి పెట్టి నడుం వాల్చింది. తల్లి భోజనం చేయలేదని మూర్తికి తెలుసు. "అమ్మా...భోజనం చేయలేదేం? వాడు బాగానే వుంటాడు ఏ స్నేహితుల దగ్గిరో...మధ్య నువ్వేమిటి కడుపు మాడ్చుకునేం?..." సహజమైన నిర్లక్ష్యం మూర్తి నోరు విప్పితే ప్రత్యక్షం అవుతుంది. కొడుకుని బయటకి పంపించి వెతికించలేని తన నిస్సహాయతకి తోడు అతని మాటలు ఆమె గుండెల్లో నిరుత్సాహాన్ని దుఃఖాన్నీ ఉప్పెనలా కలిగించాయి. ఏమో వాడు బాగానే వున్నాడనే నమ్మకం ఏమిటి?... తనకి కొడుకైతే మూర్తికి తమ్ముడు కాడూ?... మూర్తి అంత నిర్లక్ష్యంగా ఎలా వుండగలుగుతున్నడో ఆ కన్నతల్లి మెదడుకి తట్టని విషయం. పిల్లల స్వభావాలు తల్లులకి తెలియకపోవు. వాసు అల్లరివాడే కావచ్చు. రౌడీ వెధవే కావచ్చు. దానికి తనది బాధ్యతకాదు. కన్నందుకు మమకారాలూ అనురాగాలూ చచ్చేవరకు మరుగుపడవు. దిగ్గునలేచాడు మూర్తి. భుజంమీద తువ్వాలు వేసుకున్నాడు. అతని కెందుకో చాలా కోపం వస్తోంది. నోరు ఊరుకోనంటోంది. తల్లి భోజనం చేయకుండా మానసికంగా తన్ను వ్యథపెట్టటం తనకు నచ్చలేదు. తల్లివైపొకసారి నిశితంగా చూశాడు. "ఐనా ఎక్కడికని వెళ్ళేది? ఎవర్నని అడిగేది? ఎంత వద్దనుకున్నా ఒకరికోసం అన్నా చేయక తప్పదు!" చెప్పులు తొడుక్కుంటూన్న నవ్వడికి సుందరమ్మ లేచి కూర్చుంది. "నువ్వు భోంచెయ్యి. ఏదో పుట్టి మునిగిపోయినంత ఆరాటం! ఏ వెధవో ఈ వెధవకి తోడైవుంటాడు. వీడికి ఇంటిధ్యాసే వుండదు. మధ్యన నా ప్రాణానికి వచ్చింది. వాడికేం ఫరవాలేదు నువ్వు ముందు అన్నంతిను" అంటూ వీధితలుపు దభాలున వేస్తూ బయటికి వెళ్లేడు మూర్తి.

సుందరమ్మ అల్లాగే కూర్చునివుంది. తిరుగుతూన్న వాడికీ లేదు. ఇంట్లోవున్న వాడికీ లేని ఆరాటం ఆవేదనా తన కెందుకో!...వీధిలోకి వెళ్ళినవాళ్ళు తిరిగి రావటం ఓ అరగంట ఆలస్యం అయితేనే హృదయం ఏవో అర్థంలేని భయంకరాలోచనలతో కంపించిపోతుంది. సుందరమ్మ కళ్లల్లో కారు ప్రమాదాలు, రైలు పట్టీలు మరియింకా విన్నవీ, విననివీ, రకరకాల దృశ్యాలు గిర్రున తిరిగిపోయాయి. బయట చీకటి జీమూతంలాగుంది. నిశీథం భయానికి మరోపదం. మనుషులు దాన్ని కళ్ళతో చూస్తూ భరించలేరు. అందుచేతే నిద్ర అనేది పెట్టివుండాలి భగవంతుడు! సుందరమ్మకి క్షణం యుగంగా కనిపిస్తోంది. ఏ క్షణంలో ఏం జరుగుతుందో ఎవ్వరూ చెప్పలేరు. అందుకోసమే తెలియని దానికోసం ఇంత ఆరాటం ఆవేదనానూ. ఏదో తెలియరాని, నిర్వచించరాని భయంతో ఆమె మనస్సంతా సంక్షోభిస్తోంది. తలుపు తెరుచుకున్న చప్పుడుకి సుందరమ్మకి మూర్తి తనను భోంచెయ్యమని బయటికి వెళ్ళిన సంగతి గుర్తుకొచ్చింది. మూర్తి ఏం చెప్తాడో అని ఆత్రంగా చూసింది సుందరమ్మ. "వాళ్ళ రాఘవరావు నడిగాను. ఎవరో కొత్తబ్బాయితో సాయంత్రం కాలేజీ మూశాక ఎక్కడికో వెళ్తూండగా చూశాట్ట. ఏ విషయం

చెప్పలేదుట. సినీమాల రోడ్డున చూశాట్ట...... ఇంకేం...అక్కడికే వెళ్లుంటాడు. పైగా రేపేదో క్లాసుపరీక్షకూడా వుందట? హు!...వీ డింక వృద్ధిలోకి వచ్చేది కల్లే...ఇంతకీ నువ్వు భోంచేశావా? అనడిగాడు మూర్తి.

సినిమాకు వెళ్ళివుండవచ్చు ననుకుంది సుందరమ్మ. "సినిమాకి వెడితే వచ్చేవేళయిందిగా... చూసి చేస్తాను. ఐనా ఏవిటో ఆకలిగా కూడా లేదు"...వాసు ఎంత వెధవైనా వాడంటే తన తల్లికి ప్రేమ తనమీదకన్నా. అంచేత అల్లా అంటోంది అనుకున్నాడు మూర్తి. తన మాట విననప్పుడు పదేపదే తనెందుకు చెప్పాలి? మూర్తి ఈ మాత్రమే యోచించగలిగాడు. తను ధైర్యం చెప్తున్నాననే అనుకున్నాడు. కాని మాటల్లో నిర్లక్ష్యంకోసం, తన మాటలకున్న అసలు విలువనే తగ్గించేస్తున్నామన్న సంగతి అతనికి తెలియదు. అంటే అది అతని స్వభావం అనుకుంటాడు. సుందరమ్మ మనస్సు నిజంగా పాడైంది- మూర్తైనా తనకు సానుభూతిగా ధైర్యంచెప్తే ఆవిడ ఆరాటం చాలాభాగం తగ్గివుండేది. కాని అల్లా జరగలేదు. ఆవిడకి ఆకలికాలేదు. నిజమే. వాసు ఎక్కడో నవ్వుతూ కాలక్షేపం చేస్తూ వుండవచ్చు. ఇంట్లో ఈ ఒక్కప్రాణి కంగారు వాడి కసలేపట్టదు. ఇక మూర్తి విషయం చూస్తూనేవుంది. మూర్తి అప్పుడే సగం నిద్రలో వుండి వుండవచ్చు. సుందరమ్మ తనూ పక్క వేసుకుని పడుకుంది. పడకొండవుతోంది. మొదటి ఆట సినీమా విడిచేవేళ దాటిపోయింది. రెండో దానికి మరేసినిమాకో పోయివుంటాడా? అసలు సినిమాకే వెళ్ళేడో? లేదో? లేకపోతే ఏమైనట్టు? సుందరమ్మకి దుఃఖం వచ్చింది. తిరిగి మూర్తిని లేపాలనుకుంది. ఏమిటో అర్థంలేని భావం!... లేపితే వాడుమాత్రం ఏంచేస్తాడు? తిరిగి అనుకుంది. పన్నెండు ఒంటిగంట క్లాక్టవర్ కొడుతూవుంటే ఆమె వింటూనే వుంది. తలుపు ఎవరో దబదబా బాదుతూన్న చప్పుడు! ఉలికిపడి లేచింది సుందరమ్మ. తెల్లగా తెల్లవారి వుంది. పనిమనిషి తలుపు బాదుతోంది. కడుపులో ఏం బాధలున్నా నిత్యకృత్యాలు జరగడం స్తంభించదు. ఉదయంపనుల్లోకి దిగింది సుందరమ్మ.

వంట చేస్తున్నంతసేపూ వాసుని గురించే ఆలోచిస్తోంది సుందరమ్మ. ఎవడో కొత్త స్నేహితుడితో వెళ్ళేడని రాఘవరావు చెప్పేడు! ఎవరేనా మాయజేసి వాసుని తీసుకుపోయారేమో! మరు క్షణంలోనే అటువంటి ఆలోచనకి నాగరీకులు ఇచ్చే విలువ ఏమిటోకూడా ఆమెకి తట్టింది. ఎంత పిచ్చి ఆలోచనలని కొట్టిపారవేస్తూన్నప్పటికీ మనని వెంటతరిమే భావాలకి బాధ్యులం కాదు కదా!...ఏం చిన్నవాడా చితకవాడా అని మళ్ళీ సమాధానపరుచుకుంది సుందరమ్మ. ఏవేవో ఇత్యాదులే ఆవిడ హృదయంలో పరిభ్రమించాయి. తెల్లవారిన తర్వాత మూర్తికూడా వాసు విషయం అసలు ఎత్తనేలేదు. కాని కాఫీ తాగేక బయటకు వెళ్ళినవాడు తొమ్మిదింటికి కాబోలు ఇంటికి వచ్చాడు. వస్తూనే అన్నాడు. "సరస్వతీ లాడ్జ్ దగ్గర వాణ్ణి చూశాను. ఈపాటికి వస్తూనే వుండచ్చు" అంటూ తువ్వాలు పైన వేసుకుని దొడ్లోకి నడిచాడు మూర్తి. క్షణకాలం సంతోషాశ్చర్య సందేహాది వివిధ భావాల సంఘర్షణలో ఆమె స్తంభించిపోయింది. తనకు తెలియవన్నాడువివరాలు. దూరంనించి చూశానన్నాడు అన్నదమ్ముల మధ్య ఈ అవాంతరాలేఁటో! తల్లికి కష్టంగా తోచింది. వారేమీ మాట్లాడలేదు. మూర్తి ఆఫీసుకి వెళ్ళబోతున్నాడు. తీసివున్న తలుపును తోసుకుని దూసుకుంటూ వచ్చాడు వాసు. వాసింట్లో అడుగుపెట్టడం మూర్తి సైకిలు వీధిలోకి నడవటం నిశ్శబ్దంగానే గడిచిపోయాయి. కొడుకును చూడగానే మాతృహృదయం పల్లవించింది. "రాత్రంతా ఎక్కడున్నావురా?" లాలనగా అడిగిందిసుందరమ్మ. వాసు సమాధానం చెప్పలేదు సరికదా ఎదురుప్రశ్న వేశాడు! "అన్నయ్యకి కోపంగా వున్నట్టుందే!" అని.

"కోపంగావుంటే వుండవచ్చు. నీ పద్ధతిచూస్తే ఎవరికి కోపంరాదు?... అయినా ఇంట్లో రాకపోతే ఏమనుకుంటారో అన్న ఆలోచన కూడా లేదా?... పోనీ ఫలానిచోటికి వెళుతూన్నననే తీరిక కూడా లేదా?" వాసు ముఖం సీరియస్గా పెట్టేడు.

"నువ్వే అనవసరంగా నాకేం మునిగిపోయిందనో కంగారు పెట్టివుంటావు వాణ్ణి. అంచేతే

అంతకోపం... అయినా నేనేం చేశానని? చెప్పలేదని!... ఎప్పుడో చిన్నప్పుడు ఫ్రెండ్ హఠాత్తుగా కనపడి బలవంతం చేశాడు. వెళ్ళకతప్పింది కాదు. రాత్రి సినిమా అవగానే వద్దామనుకున్నా పదకొండింటికి ఏం వెడతావంతదూరం అంటూ తన రూముకి తీసుకెళ్ళేడు!

హోటల్లో కాఫీ తాగితేగాని వాడు వదలి పెట్టలేదు. అయినా ఇంతగా అనుకుంటారని నాకు మాత్రం తెలుసునా? కొంప మునిగిపోయినంత రాద్ధాంతం! కోపతాపాలు! అసలీ యింట్లో నే నంటేనే కోపం! రాఘవగాణ్ణే మరెవరో కోన్ కిస్కాగాణ్ణే అందర్నీ అడిగేవుంటారు. ఆ వెధవలందరికీ ఫలానారోజు రాత్రి నేనింటికి రాలేదని తెలియాలి! నయం ఇంకా పోలీసుస్టేషనుకి రిపోర్టు ఇప్పించలేదు... కాలేజీకి టైం అవుతోంది... అన్నం పెట్టు" అంటూ స్నానాల గదిలోకివెళ్లి దభాలున తలుపు వేసుకున్నాడు. సుందరమ్మ క్షణకాలం నిర్ఘాంతపోయి నిలుచుంది. నోరు మెదప లేని తల్లి, అభిమానం పొంగుకు వస్తూన్న తల్లి, మనుష్యుల ఆరాటాలు అంతర్యాలకున్న విలువలు కళ్ళముందొక్కమారు సుళ్ళు తిరుగుతూవుంటే నీటి కళ్ళకు పైటచెరుగడ్డం చేసుకుంది.

# ప్రోషిత భర్తృక

తుడుచుకోవె ఇంక కనులు
ముడుకుకోవె ఇంక కురులు
కురులందున పూలసరులు
    సరులపైనను మరులుగొను నీ
    తరుణుడింకిటవచ్చులే!
గగనమందు నవజలదము
కల్పించిన మృదుభావము
భావములో దరహసనము
    హసనముంగని గుసులుకొను మా
    నసవిహారి ఇటొచ్చులే!
మధురజలద గర్జనములు
మానసపుట భేదకములు
భేదకములు బోధకములు
    బోధితోత్సుక మానసముతో
    నాథుడింకరదెంచులే!
దారులందు నీ చూపులు
దండకట్టు కలువపూలు
కలువపూల మధుకీలలు
    కీలాకుల హృదయముతో నీ
    విలాసి ఈ క్షణమొచ్చులే!
ఇంక కనుల మబ్బులేల?
ఇంక మోమున బెదరులేల?
బెదరులలో భయములేల?
    భయమునుం బెడద్రోయగల నీ
    ప్రియుడు తానిదె వచ్చెలే!

—సంపత్కుమార.